ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0

## ఏలూరు జిల్లాలో 144 మద్యం షాపులు



ఏలూరు క్రైం, అక్టోబరు 1: నూతన ఎక్సైజ్ పాలసీ అమలుతో జిల్లాలో జిల్లాలో 144 మద్యం షాపులు, 16 బార్లు ఏర్పాటు కానున్నాయి. 7 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు, 130 మంది ఎక్సైజ్ సిబ్బందిని నియమించారు. మద్యం షాపులకు, బార్లకు మంగళవారం నుంచి ఈ నెల 9 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 11న ఏలూరు కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ తీసి లైసెన్సులను మంజూరు చేస్తారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని కుక్కునూరులో 1, బుట్టాయిగూడెంలో 4, వేలేరుపాడులో 1, జీలుగుమిల్లిలో రెండు షాపులు పూర్తిగా గిరిజన తెగకు కేటాయించారు. ఆ షాపులకు దరఖాస్తు చేసుకునే వారు స్థానికులై ఉండాలి. జిల్లాలో జనాభా ప్రాతిపదికన లైసెన్సుదారుల నుంచి సొమ్ము వసూలు చేస్తారు.

### మండలాల వారీగా షాపులు

ఏలూరు నగరంలో 21, ఏలూరు రూరల్ 5, దెందులూరు 4, పెదపాడు 5, పెదవేగి 6, చింతలపూడి 2, చింతలపూడి రూరల్ 3, కామవరపుకోట 4, లింగపాలెం 4, టి.నర్సాపురం 3, భీమడోలు 7, ద్వారకాతిరుమల 5, ఉంగుటూరు 7, నిడమర్రు 3, జంగారెడ్డిగూడెం అర్బన్ 7, జంగారెడ్డిగూడెం రూరల్ 4, కుక్కునూరు 2, జీలుగుమిల్లి 2, వేలేరుపాడు 1, పోలవరం 3, కొయ్యలగూడెం 5, బుట్టాయిగూడెం 4, కైకలూరు 8, కలిదిండి 5, ముదినేపల్లి 5, మండవల్లి 3, నూజివీడు అర్బన్ 3, నూజివీడు రూరల్ 4, ఆగిరిపల్లి 4, చాట్రాయి 2, ముసునూరు 3.

## ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకాధికారులు



జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరుసిటీ, అక్టోబరు 1: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించేందుకు మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ధాన్యం కొనుగోలు కొనుగోలు సన్నాహక ఏర్పాట్లపై జేసీ పి.ధాత్రిరెడ్డి మంగళవారం ప్రత్యేకాధికారులకు సూచనలు ఇచ్చారు. మండలస్థాయి అధికారులతో సమస్యలపై సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. చింతలపూడి, ఉంగుటూరు, జంగారెడ్డిగూడెం మండలాలకు ఆర్డీవోలు, నిడమర్రు మండలానికి జడ్పీ సీఈవో, దెందులూరుకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి, పెదపాడుకు మత్స్య శాఖ జేడీ, భీమడోలుకు డీఆర్డీఏ పీడీ, ముదినేపల్లికి డ్వామా పీడీ, పెదవేగికి డీసీవో, పోలవరానికి వయోజనవిద్య ఏడీ ప్రత్యేకాధికారులుగా వ్యవహరిస్తారు.

# పరిహారం.. ఫలహారం



ఐదేళ్లు ఎటు చూసినా అరాచకమే. ఉన్నోడైనా లేనోడైనా వారి చేతిలో నిలువు దోపిడీ. ఎక్కడ వీలైతే అక్కడ చేతికందినకాడికి నొక్కేశారు. అధికారులను మీకింత మాకింత అంటూ దారికి తెచ్చుకుని మరీ ఇష్టానుసారం వ్యవహరించారు. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన వారినీ విడిచి పెట్టలేదు. అంతా మేమే చేస్తామని నమ్మబలికి సొమ్ములను అడ్డంగా కాజేశారు. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు సృష్టించారు. గిరిజన, గిరిజనేతర కుటుంబాలను వంచించిన తీరుపై ఐదేళ్లు కొనసాగిన దురాగతాలు, అక్రమాలు, అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందిగా తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు జనసేన నేతలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై సర్కారు విచారణకు ఆదేశాలు జారీ చేయనుంది.

## వైసీపీ ఐదేళ్ల అక్రమాలపై సీఎంకు జనసేన ఫిర్యాదు

- నివేదిక ఇచ్చిన నేతలు
- ప్రభుత్వ భూముల్లో లీజు బాగోతం
- ఐటీడీఏలో అక్రమాల ప్రస్తావన
- విచారించి నిగ్గు తేల్చాలని విన్నపం
- త్వరలో సర్కారు నిర్ణయం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఉద్దేశించిన సహాయం, పునరావాసం(ఆర్అండ్ఆర్) కింద గడిచిన రెండున్నర దశాబ్దాలుగా గిరిజన, గిరిజనేతరులతో ఓ ఆటాడుకున్నారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేసేందుకు నిర్దేశిత ముంపు గ్రామాల్లో కుటుంబాలను తరలించేందుకు సిద్ధపడ్డారు. 2006 నుంచే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఎదురు తిరిగిన.. నిలదీసి ప్రశ్నించినా కేసులు పెట్టారు. రాజకీయాల్లో ఆరితేరిన వారు బీద బిక్కి జనాన్ని బెదిరించారు. వారికి తోడుగా నిలిచిన వామపక్ష నేతలను వదిలిపెట్టలేదు. ఆది నుంచి నిర్వాసిత కుటుంబాలన్నీ జీవనపోరాటం చేస్తూనే వచ్చాయి. పోలవరం కోసం త్యాగాలకు సిద్ధపడింది ఇందుకేనా అంటూ నిలదీసిన వారిలో అత్యధికులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు. ఎక్కడికక్కడ రాజకీయ దళారులు పుట్టుకొచ్చారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లి, ఇతర మండలాల్లో గడిచిన ఐదేళ్ల పాటు జరిగిన అవకతవకలు లెక్కలేనన్ని. వీటిపైనే తాజాగా ఎన్నికైన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన సీనియర్ నేత కరాటం రాంబాబు నేరుగా చంద్రబాబును కలిసి గడిచిన ఐదేళ్లలోనూ, అంతకు ముందు అధికారులే కాకుండా వైసీపీ నేతలు ఏ రూపంలో నిర్వాసితులకు చెందిన పరిహారాన్ని.. ఫలహారంగా మేసేశారో సవివరంగా సీఎంకు నివేదించారు.

### అంతటా మోసం.. దగా..

కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని మండలాల్లో సహాయ పునరావాస పథకం కింద ఆర్అండ్ఆర్ దశాబ్దాల క్రితమే నిర్వాసితులకు పూర్తిగా పరిహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్రాలు నిధులు సమకూర్చాయి. 2019-24 మధ్య అధికారంలో వున్న వైసీపీ నేతలు నిర్వాసిత కుటుంబాలతో చెడుగుడు ఆడేందుకు ప్రయత్నించారు. పరిహారం రెట్టింపు చేసి ఇస్తామని, వివాహం కాని నిర్వాసితులను ఆదుకుంటామని నమ్మబలికారు. ప్రత్యేకించి జీవోలు జారీ చేశారు. వీటి అమలుకు పైసా రాలేదు గాని అందరికీ ఇచ్చేసినట్లు ఫోజు కొట్టారు. ఐటీడీఏ పరిధిలో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని ఇంతకు ముందే అక్కడ పనిచేసిన పలువురు పీవోలు, కార్యాలయ సిబ్బందిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. విచారణ పేరిట అప్పటికప్పుడే స్పందించడం, తరువాత గాలికొదిలేయడం వంటి పరిణామాలు చోటు చేసు కున్నాయి. దర్భగూడెం గ్రామ పరిధిలో ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు నమ్మించి కొందరి ఖాతాలకు నిధులు కేటాయించారు. తరువాత అక్కడికక్కడ డమ్మీ నోటీసులు ఇచ్చి ఆ సొమ్ము తమ ఖాతాల్లోకి చేర్చుకునేలా మరికొందరు అక్రమా లకు పాల్పడ్డారు. ఈ తరహాలో దాదాపు రూ.150 కోట్లు దారి మళ్లినట్లు అప్పట్లోనే విమర్శలు గుప్పుమన్నాయి. ఇంకో వైపు చేతికందినంతా దోచుకునేందుకు వైసీపీ నేతలు అప్పట్లో తెగించి వ్యవహరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా కాటంనేని భాస్కర్ అప్పట్లో ఆర్అండ్ఆర్ పనుల్లోకి రాని భూమి ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో ఉందో తేల్చి నివేదిక ప్రభుత్వానికి సమర్పించారు. అయినా కొన్ని భూముల్లో అసలు యజమానులు వీరేనంటూ అప్పట్లోనే కొందరు డమ్మీలను రంగంలోకి దింపారు. అనంతరం జగన్ ప్రభుత్వ హయాంలో చేతికి అందినకాడికి నొక్కేసి అక్రమాలకు పాల్పడ్డారు. అక్రమాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందినా విచారించి, నిర్ధారించే యంత్రాంగం లేక పెండింగ్‌లో పడేశారు. ఐటీడీఏ వ్యవహారం చెప్పలేనంతగా రచ్చకెక్కింది. వైసీపీ అనుకూలురకు ఒక విధంగా, వ్యతిరేకులుంటే మరో విధంగా వ్యవహరించారు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు అందిన ఫిర్యాదులో జనసేన స్పష్టంగా పేర్కొంది. ప్రత్యేకించి దర్భగూడెం పరిధిలో అనేక అవకతవకలు బహిర్గతమయ్యాయి. అధికారుల మాయజాలంతో మాత్రం ఎక్కడికక్కడి విషయాన్ని నొక్కి పెట్టి ఉంచారు.

### లీజులో లిటిగేషన్

ప్రాజెక్ట్ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో సాధ్యమైనంత మేర పరిహారం చెల్లించి ఆయా భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆ భూముల్లో సాగు, ఇతరత్రా ఏవీ చేపట్టరాదని కచ్చితమైన ఆంక్షలు పెట్టారు. దాదాపు 3750 ఎకరాల్లో భూసేకరణ పూర్తయినా వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతలు దళారులుగా మారారు. ఆయా భూములను కొందరికి లీజుకు ఇచ్చి మరీ సొమ్ములు రాబట్టుకున్నారు. అధికారులెవరూ ఈ వైపు రాకుండా చూసుకుంటాం. మీరు పండించుకోండి, పంటను జాగ్రత్త చేసుకోండి, మాకైతే ఎకరానికి ఇంత చెల్లిస్తే ఇదంతా సాధ్యం అంటూ వల విసిరారు. మూడో కంటికి తెలియకూడదు. పేర్లు చెప్పకూడదంటూ రాజకీయ దళారులు నిర్వాసిత కుటుంబాలకు షరతు విధించారు. భూసేకరణలో భూమి, ఊరిపై పూర్తి హక్కు కోల్పోయిన తరువాత వారందరికీ జీవనాధారం కోసం భూమికి భూమి, ఉండడానికి కాలనీలు నిర్మించారు. అయినా గ్రామాలను ఖాళీ చేయడానికి ఇష్టపడిన వారంతా కోల్పోయిన భూములనే లీజు తీసుకుని పంట వేయడానికి తలొగ్గారు. దీనితో దళారుల పంట పండింది. వేలాది ఎకరాల్లో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల చొప్పున లీజు సొమ్ము రాబట్టి కోట్లాది రూపాయలు దండుకున్నారు. దీనిలో వైసీపీ నేతలంతా భాగస్వామ్యం దక్కించుకున్నారు. లీజు రూపంలో అక్రమాలు వెలుగుచూసినా యంత్రాంగం మాత్రం మాకేం తెలియదు.. అన్నట్టు వ్యవహరించింది. ఈ విషయాలన్నింటి పైనా సీఎంకు ఇచ్చిన నివేదికలో పొందుపర్చారు.

**• విచారణ భయం**

జనసేన నేతలు కోరినట్లు ఆర్అండ్ఆర్‌లో అక్రమాలు, లీజు వసూళ్లలో అవినీతి ఐటీడీఏ పరిధిలో ఐదేళ్ల పాటు సాగిన డమ్మీ వ్యవహారాలపై ప్రభుత్వ విచారణ జరుగుతుందని కొందరికి భయం పట్టుకుంది. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. సహాయ, పునరావాస అక్రమాలపై వైసీపీ హయాంలో దళారుల చేతి వాటం, కొమ్ము కాసిన నాయకులపై విచారణకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సంకేతాలు అందుతుండడంపై వైసీపీలో కొందరు బిక్కుబిక్కుమంటున్నారు.

## రోజుకు 67 వేల మంది విద్యార్థుల గైర్హాజరు

- విద్యా శాఖ సమీక్షలో గుర్తింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 1: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన 2.65 లక్షల మంది విద్యార్థులలో రోజూ దాదాపు 67 వేల మంది గైర్హాజరవుతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. జిల్లాలోని విద్యాశాఖ అధికారులతో మంగళవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో పలు అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించారు. అధిక సంఖ్యలో పిల్లలు పాఠశాలకు రాకపోవడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. దసరా సెలవుల అనంతరం హెచ్ఎంలు, ఉపాధ్యాయులు బడికిరాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కారణాలు తెలుసుకోవాలన్నారు.జిల్లాలో టీచర్లు సుమారు వంద మంది గైర్హాజరవుతున్నట్టు ఉన్నతాధికారులు భావిస్తు న్నారు. ఉదయం తొమ్మిది గంటల్లోగా విధులకు హాజరై, ముఖ ఆధారిత ఈ-హాజరు నమోదు చేయాలి. 9.30 గంటల తర్వాత హాజరు నమోదు చేయడాన్ని గైర్హాజరుగా పరిగణిస్తామని ఉన్నతాధికారులు వివరించారు.

## రేపటి నుంచి 'టెట్'

ఏలూరు అర్బన్, అక్టోబరు 1: ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (ఏపీ టెట్-2024) ఈ నెల 3 నుంచి 21 వరకు జరగనుంది. ఏర్పాట్లు పూర్తిచేసినట్టు డీఈవో అబ్రహం మంగళవారం తెలిపారు. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో 5470 మంది, వట్లూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 600 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయన వివరించారు. అభ్యర్థుల హాల్ టిక్కెట్లలో తప్పులుంటే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పరీక్ష కేంద్రం వద్ద నామినల్ రోల్స్‌లో సరిచేయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. హాల్‌టిక్కెట్, ఏదైనా గుర్తింపుకార్డుతో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగా రావాలని డీఈవో సూచించారు. సందేహాలుంటే 83281 86618, 90307 23444 నెంబర్లులో సంప్రదించాలన్నారు.



పోటీలకు ఎంపికైన మోగల్లు హైస్కూల్ విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

## రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మోగల్లు విద్యార్థులు

పాలకోడేరు, అక్టోబరు 1: ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఈ నెల 30వ తేదీన జరిగిన స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు మోగల్లు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు త్రినాథ్, పీడీ రాంబాబు తెలిపారు. అండర్-17 విభాగంలో ఆర్.మానస, పీ.తరుణ్, జీ.వినయ్‌భాస్కర్, ఎం.హర్షిత దుర్గ ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎం.నాగేంద్రబాబు, వీ.యశ్వంత్‌కుమార్, జీ.సుభద్ర ఎంపికయ్యారు. పీడీ రాంబాబును హెచ్ఎం, సర్పంచ్ ఎం.కృష్ణకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.



## ఫుట్‌బాల్ పోటీలకు జి.కొత్తపల్లి విద్యార్థులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 1: రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 ఫుట్‌బాల్ పోటీలకు కె.రాజేష్, బాలికల్లో జాస్మిన్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.లీలాకుమార్ తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో కె.మణిదీప్తి, అండర్-14 బాలుర విభాగంలో తేజ ఎంపికయ్యారు. అండర్-14 టచ్ రగ్బీ పోటీలో బాలికల విభాగంలో శ్రావణి, శరణ్య మల్లీశ్వరి, అండర్-17లో కె.కీర్తి, బాలురలో జశ్వంత్ ఎంపికయ్యారు.



## ఏలూరులో సత్య ఏజెన్సీస్ షోరూం ప్రారంభం

ఏలూరు, అక్టోబరు 1: ఏలూరు నగరంలో సత్య ఏజెన్సీస్ షోరూం ఏర్పాటైంది. సీఎల్ఎన్ ఐకాన్ బిల్డింగ్‌లో ఈ షోరూంను సత్య కుటుంబీకులు రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా ప్రారంభించారు. సత్య ఏజెన్సీస్ స్టేట్ హెడ్ సెంథిల్, ఆనంద్, వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సెంథిల్ మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి చెందిన కంపెనీలకు చెందిన ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ ఇక్కడ అందుబాటులో వుంటాయని తెలిపారు.

## 3 నుంచి కుంకుళ్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



ద్వారకాతిరుమల, అక్టోబరు 1: ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయంలో అమ్మవారి దశరా మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయాన్ని సిబ్బంది సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాలను రంగులు, విద్యుత్ దీపతోరణాలతో అలంకరించారు. ఈనెల 12 వరకూ జరుగనున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారని ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈనెల 3న బాలా త్రిపుర సుందరిదేవిగా, 4న గాయత్రిదేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, 7న మహాచండీ దేవిగా దర్శనమిస్తారన్నారు. 8న శ్రీమహలక్ష్మీ దేవిగా, 9న మూలా నక్షత్రం పురస్కరించుకుని సరస్వతీదేవిగా, 10న దుర్గా దేవిగా, 11న మహిషాసుర మర్దనీ దేవిగా 12న రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారన్నారు. అదేరోజు సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో అమ్మవారి రథోత్సవం, 13న ఉదయం 7 గంటలకు ఇరుముడుల సమర్పణ, చండీహోమం నిర్వహిస్తామని, 14 ఉదయం 11 గంటలకు భారీ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

# మహాత్ముని మార్గంలో..



భారత స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పాత్ర ప్రత్యేకమైనది.. సత్యం, అహింస, సత్యాగ్రహ విధానాల ద్వారా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన శాంతియోధుడు మహాత్మాగాంధీ. సత్యాగ్రహ ఉద్యమాలతోనే ఆయన పోరాటం సాగించారు. సత్యం.. అహింస ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్యమాలకు పునాదిగా నిలిచాయి. ఆయన జన్మదినం పురస్కరించుకుని 2007లో ఐక్యరాజ్య సమితి అక్టోబరు 2ను అహింసా దినం (నాన్ వయొలెన్స్ డే)గా ప్రకటించింది.

**నేడు గాంధీ జయంతి** సందర్భంగా ప్రత్యేక కథనం - నిడమర్రు

### గాంధీజీ అడుగు జాడలు

స్వాతంత్ర్య పోరాటంలో జరిగిన వివిధ ఉద్యమాలలో భాగంగా గాంధీజీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు, భీమవరం, మల్లవరం, పాలకొల్లు, కొవ్వూరు ప్రాంత్రాలను సందర్శించి ప్రజలతో అనేక సభలలో పాల్గొన్నారు. మల్లవరం గ్రామాన్ని సందర్శించి ఆ ప్రాంత్రవాసుల పద్ధతులు నచ్చి ఆయనే స్వయంగా 7 వేల రూపాయలు ఇచ్చి ఆశ్రమం నిర్మించాలని కోరారు. ఇప్పుడు మల్లవరంలో గాంధీజీ స్మారక కేంద్రంతో పాటు అనాథ ఆశ్రమం, వృద్ధాశ్రమాలను ఆనంద నికేతన్ పేరుతో నిర్వహిస్తున్నారు. మహాత్మా గాంధీ ఆశయాలు నచ్చిన పత్తేపురం ప్రముఖుడు చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో గాంధీ భవనం నిర్మించారు. గాంధీజీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రచారం చేశారు. గాంధీ జయంతి, వర్ధంతి నాడు సర్వోదయ మండలి నాయకులు ఇక్కడ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.



పెదనింద్రకొలను గాంధీ భవనం

### స్వచ్ఛతా హి సేవ

గాంధీజీ ఆశించిన గ్రామస్వరాజ్యం మన గ్రామాల్లో వెల్లివిరియాలి. గ్రామాలు స్వయం సంవృద్ధితో సుపరిపాలన చేపట్టినప్పుడే గ్రామ స్వరాజ్యం సాధించినట్లని చెబుతుండేవారు. గాంధీజీ సిద్ధాంతాలలో ప్రధానమైనది స్వచ్ఛత.. మన ఇల్లు, మన పరిసరాలు, మన గ్రామం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యంగా జీవించగలమని ఆయన ఆలోచన. స్వచ్ఛత కోసం తన సబర్మతి ఆశ్రమాన్ని ఆయనే ఎన్నోసార్లు చీపురు పట్టి శుభ్రపరిచేవారు. ఒకరికి చెప్పేముందు మనమే ముందుగా ఆచరించి చూపాలని ఆయన నమ్మిన సిద్ధాంతం.

### గాంధీ బాటలోనే విజయాలు

నేటి తరానికి గాంధీ సిద్ధాంతాలు వింతగా అనుపిస్తున్నా ప్రపంచ మేధావులతో మన్ననలు పొందిన గొప్ప సిద్ధాంతాలుగా పేరొందాయి.నేటి రాజకీయ ఉద్యమాలలో హింసామార్గం ద్వారానే తన లక్ష్య సాధనకు యువత ఆసక్తి చూపిస్తున్నారు. అహింసా మార్గం అనుసరించడానికి ఎంతో ధైర్యం, ఓపిక, సహనం ఉండాలని అవి ఉన్నప్పుడే మన సాధించవచ్చని, ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని గాంధేయ వాదుల ప్రధాన విశ్వాసం. నేటి యువత గాంధీ బోధించిన సత్యం, అహింస, సత్యాగ్రహం, స్వచ్ఛత, అవినీతి రహిత సమాజ రూపకల్పన విధానాలను తప్పక పాటించాలి.

### గాంధీ మార్గం అనుసరణీయం



నేటి సమాజంలో కూడా గాంధీ మార్గం అనుసరణీయం. మనం ఏదైతే ఆలోచిస్తామో అదే ఇతరులకు చెప్పాలని, అదే ఆచరించాలని గాంధీ బోధించేవారు. సత్యం. అహింస, సత్యాగ్రహ పోరాటం నేటికీ ప్రపంచానికి అనుసరణీయ మార్గాలు. గ్రామ స్వరాజ్యం ద్వారా గ్రామాలు స్వయం సంవృద్ధి సాధిస్తాయని గాంధీ చెప్పిన మాటలు నేటికీ అక్షర సత్యం

-కాజా పూర్ణచంద్ర గాంధీ, గాంధీ స్మారక నిధి చైర్మన్

### గాంధీ సిద్ధాంతాలపై విద్యార్థుల్లో అవగాహన



అహింస పునాదిగా నిర్మించిన ఆయన సిద్ధాంతం అనేక దేశాలలో శాంతియుత స్వాతంత్ర్య ఉద్యమాలకు బీజం వేసింది. గాంధీజీ మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా సత్యం - అహింస విలువలుగా చేసుకొని జీవించడమే ఆయనకు మనమందించే నిజమైన నివాళి గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాల సందర్భంగా విద్యార్థుల్లో ఆయన సిద్ధాంతాలపై అవగాహన కల్పించే విధంగా వివిధ పోటీలు నిర్వహిస్తున్నాం.

- ఇందుకూరి ప్రసాదరాజు,సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి



గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి (ఫైల్ ఫొటో)

## గాంధీజీ సిద్ధాంతాలు ప్రజల్లోకి..

**18 ఏళ్లుగా వైఎన్ కళాశాలలో గాంధీజీ అధ్యయన కేంద్రం కృషి**

**విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సులు**

**స్వచ్ఛభారత్, పర్యావరణంపై అవగాహన ర్యాలీలు**

నరసాపురం, అక్టోబరు 1: గాంధీజీ అనుసరించిన సత్యం, అహింస, శాంతియుత మార్గాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నరసాపురం వైఎన్ కళాశాలలోని గాంధీజీ అధ్యయన కేంద్రం 18 ఏళ్లుగా కృషి చేస్తున్నది. 2006లో యూజీసీ సహకారంతో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సుమారు 15 వేలమంది విద్యార్థులకు గాంధీజీ మార్గాలపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను అందజేసింది. సబ్‌జైలు, సెంట్రల్‌జైలులో శిక్షణ పొందుతున్న ఖైదీలకు కూడా ఈ మార్గాలను బోధించి వారికి కూడా సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. దేశ, విదేశాల్లోని ఎంతమంది ప్రముఖులు ఈ కేంద్రాన్ని సందర్శించి ప్రశంసల వర్షం కురిపించారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛభారత్ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నది. ప్రతి ఏటా గాంధీ జయంతి పురస్కరించుకుని స్కూల్, కాలేజీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. జిల్లాలోని ఇతర కళాశాలలకు కూడా వెళ్లి విద్యార్థులకు గాంధీజీ సిద్ధాంతాలను బోధిస్తారు.ప్రజల్లో మార్పు తీసుకొచ్చేందుకు తాము చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాలు ఇచ్చిందని కేంద్రం డైరెక్టర్ పులపర్తి సుబ్బారావు చెప్పారు. ఈ ఏడాది కూడా గాంధీ జయంతి పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన పోటీల్లో విజేతలకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, పోలిశెట్టి రఘురాం, గంథం రామకృష్ణ, ప్రిన్సిపాల్ కనకరావులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

## జూనియర్ కళాశాలలకు 'దసరా'ముసురు

**రేపటి నుంచి ప్రభుత్వ కళాశాలలకు సెలవులు**

**మూడు రోజులపాటు ప్రైవేటు కళాశాలలకు అనుమతులపై దుమారం**



ఏలూరు అర్బన్, అక్టోబరు 1 : విద్యాసంస్థలకు దసరా సెలవుల విషయంలో వివాదం నెలకొంది. ఇంటర్ విద్యను బోధించే జూనియర్ కళాశాలలకు ఈ నెల 3నుంచి 13 వరకు దసరా సెలవుల నిమిత్తం రాష్ట్రమంతటా ఒకే విధానం అమలు చేయాలని ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీచేయగా, జిల్లాలోమాత్రం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు వేర్వేరు పద్ధతులను పాటిస్తుండటమే దీనికి కారణం. ఇంటర్‌బోర్డు నిర్ణయం ప్రకారమే గురువారం నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వర్తింప జేస్తుండగా, దీనికి భిన్నంగా ఈ నెల 3, 4, 5 తేదీల్లో తరగతులు నిర్వహించుకోవడానికి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేసుకున్న అభ్యర్థనకు జిల్లా అధికారులు అంగీకారం తెలపడంపై అటు విద్యార్థుల్లోను, ఇటు జూనియర్ లెక్చరర్లలోను తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఆదీనంలోని సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్, ఎయిడెడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మొత్తం 64 ఉండగా, వీటిలో 7473 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక ప్రైవేటు జూనియర్ కళాశాలలు మొత్తం 81 ఉండగా, వీటిలో 28,457 మంది విద్యనభ్యసిస్తున్నారు. వాస్తవానికి దసరా సెలవులను ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలన్నీ పాటించాల్సిందే. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థుల పట్ల ఇంటర్‌బోర్డు వ్యత్యాసం చూపిస్తుందనడానికి దసరా సెలవులే నిదర్శ నమని ఏపీ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.అంబేద్కర్ ధ్వజ మెత్తారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు ఇంటర్‌బోర్డు అమ్ముడుపోయిందని ఆరోపించారు. దసరా సెలవుల్లో ప్రైవేటు కళాశాలలు నిర్వహించుకోవడానికి ఇంటర్ బోర్డు ఇచ్చిన అనుమతులను రద్దుచేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

**వరదలు, వర్షాల వల్ల కోల్పోయిన తరగతుల రికవరీ కోసమే..**

జిల్లాలో ప్రైవేటు జూనియర్ కళాశాలలకు దసరా సెలవుల్లో మూడు రోజులపాటు తరగతులు నిర్వహించుకోవడానికి అనుమతులివ్వడంపై ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణాధికారి చంద్రశేఖర్ వివరణ ఇచ్చారు. 'ఇటీవల భారీవర్షాలు, వరదల వల్ల కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు కాంపన్సేటరీ సెలవులను ప్రకటించారు. ఈ సెలవులు ఆరువరకు ఉన్నాయి. ఈ నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వ సెలవుదినాల్లో పరిహారంగా విద్యాసంస్థలు పనిచేయాల్సిఉంటుంది. దీనికనుగుణంగానే ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులను అభ్యర్థించగా అంగీకరించారు. ఈ వెసులుబాటు కేవలం తుపాను లేదా భారీ వర్షాల ప్రభావిత జిల్లాలకు మాత్రమే వర్తించేలా అంగీకారం తెలిపారు.' అని వివరించారు. ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలల విషయమై జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి (డీవీఈవో) ప్రభాకరరావు వివరణ ఇస్తూ 'ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోగా మిగతా సెలవు దినాల్లో ప్రభుత్వ కళాశాలలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతానికి మాత్రం ప్రభుత్వ షెడ్యూలు ప్రకారమే ఈ నెల 3నుంచి 13 వరకు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు వర్తిస్తాయి.' అని తెలిపారు.

## దసరాకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

**హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక బస్సులు**

**పశ్చిమ నుంచి 4 రోజుల పాటు 40 సర్వీసులు**

**ఏలూరు జిల్లా నుంచి 63 స్పెషల్స్**

**రాను పోను టిక్కెట్లు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ**



భీమవరం టౌన్/ ఏలూరు క్రైం, అక్టోబరు 1 : దసరా పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రయాణికులను తీసుకు వచ్చేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. ఉమ్మడి గోదావరి జిల్లా నుంచి 103 సర్వీసులను నడుపుతున్నారు.డిపోల వారీగా రోజుకు ఎన్ని బస్సులు పంపాలనే లక్ష్యాలను ఇప్పటికే నిర్ధారించారు. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులకు చర్యలు తీసుకున్నారు. అలాగే ఏలూరు, జంగారెడ్డి గూడెం, నూజివీడు డిపోల నుంచి 8,9,10,11 తేదీల్లో మొత్తం 63 సర్వీసులు నడపాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఏలూరు డిపోకు 26 సర్వీసులు, జంగారెడ్డిగూడెం 17, నూజువీడు డిపో నుంచి 20 సర్వీసులు నాలుగు రోజుల పాటు నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రదేశాలకు ఏ విధమైన అధిక ఛార్జీలు లేకుండా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. దసరా అయిన తర్వాత తిరుగు ప్రయాణానికి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు వెళ్ళేందుకు ఆర్టీసీ అధికారులు 13,14 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారు.

### పశ్చిమ నుంచి 41 సర్వీసులు

హైదరాబాద్ నుంచి 41 సర్వీసులను ఏర్పాటు చేశారు. 8, 9 10, 11 తేదీల్లో డిపోల వారీగా లక్ష్యాలను నిర్ధారించారు. భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోలకు లక్ష్యాలను నిర్ణయించారు. భీమవరం డిపోకు 13, నరసాపురానికి 14, తణుకు 11, తాడేపల్లిగూడెం 3 సర్వీసులు నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్ వెళ్ళేందుకు కూడా ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. డిపోల్లో రద్దీని బట్టి సర్వీసులను ఏర్పాటు చెయ్యనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్కింగ్ ఏర్పాటు చేశారు. విశాఖపట్నం నుంచి వచ్చేవారి కోసం కూడా భీమవరం, నరసాపురం డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులను నడిపేలా ఆలోచన చేశారు. రెగ్యులర్ సర్వీసులకు అదనంగా వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఒకేసారి రానుపోను టికెట్లను బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ ఇస్తున్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం మూలా నక్షత్రం నుంచి దసరా వరకు ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపాలనే ఆలోచన చేస్తున్నారు.

### దసరా రద్దీపై ప్రత్యేక దృష్టి



ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సర్వీసులను నడపాలనే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ముఖ్యంగా హైదరాబాద్ సర్వీసులతో పాటు, విజయవాడకు ప్రత్యేక సర్వీలను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే డిపోల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం.

- ఎన్‌వీఆర్ వరప్రసాద్ , ప్రజా రవాణాధికారి



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లను పరిశీలిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రవణ్‌కుమార్, సీఐ సుభాష్, ఎస్ఐ మణికుమార్

## మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

**16 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం**

గణపవరం, అక్టోబరు 1: అంతర జిల్లాల మోటార్ సైకిళ్ల దొంగను అరెస్టు చేసి 16 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు డీఎస్పీ డీ.శ్రవణ్ కుమార్ గణపవరం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలిపారు. ఏలూరు జిల్లా కొయ్యల గూడెం మండలం చొప్పరామన్నగూడెం గ్రామానికి చెందిన చప్పిడి మునలయ్య ఏలూరు, పశ్చిమ, కృష్ణా, తూర్పుగోదావరి, గుంటూరు, జిల్లాల పరిధిలోని మోటార్ సైకిళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్నాడని అన్నారు. గణపవరం మండలం ముగ్గళ్ళ గ్రామానికి చెందిన శెట్టి చిన్నాతో కలిసి ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్ప డుతున్నాడని అన్నారు. గతంలో చిన్నాను అరెస్టు చేయగా మంగళవారం మున లయ్యను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మొత్తం రూ.40 లక్షల విలువ గల 45 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసును చేధించిన నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, ఎస్ఐ మణికుమార్, పోలీస్ సిబ్బంది హేమసుందర్, కాంతయ్య, రత్నబాబు, సత్యనారాయణ, జగపతిబాబులను జిల్లా ఎస్పీ కిషోర్, డీఎస్పీ శ్రవణ్‌కుమార్ అభినందించారు.





విలేకరులకు వివరాలు తెలుపుతున్న అదనపు ఎస్పీ మురళీకృష్ణ

## దారి దోపిడీకి పాల్పడిన ఏడుగురి అరెస్టు

**రూ.1.70 లక్షల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం**

నరసాపురం, అక్టోబరు 1: నరసాపురం మండలం సీతారాంపురం టోల్ ప్లాజా సమీపంలో సోమవారం రాత్రి ఓ చిరు వ్యాపారిని కొట్టి రూ.2 లక్షలు దోపి డీకి పాల్పడిన కేసు మిస్టరీని పోలీసులు కొద్ది గంటల్లోనే ఛేదించారు. తోటి వ్యాపారిని ఆర్థికంగా దెబ్బతీయాలన్న అక్కసుతోనే ఇదే వ్యాపారం చేస్తున్న మరో ఇద్దరు ఐదుగురు కిరాయి వ్యక్తులతో ఈ దోపిడీకి పాల్పడినట్లు అదనపు ఎస్పీ మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాల యంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన రాపాక చంద్రరావు విదేశీ వస్తువుల విక్ర యిస్తుంటాడు. దీంతో పాటు విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి కరెన్సీ కొనుగోలు చేసి వాటిని వెస్ట్రన్ మనీ సెంటర్లలో అమ్ముతుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన మేడిద వెంకటరెడ్డి, మాణిక్యబాబులు కూడా ఇదే వ్యాపారం చేస్తుంటారు. అయితే చంద్రరావు వ్యాపారం స్పీడ్‌గా ఉండడంతో అతన్ని ఆర్థికంగా దెబ్బ తీయాలని స్కెచ్ వేశారు. కోనసీమ జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ, భయ్యా హేమసాగర్, కోరుకొండ గిరిబాబు, గంటా రాజు, మలికిబాబులను పురమాయించి రెండు లక్షలు విలువైన విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయంటూ చంద్రరావుకు ఫోన్ చేయించారు. సీతారంపురం సమీపంలోని రాజుగారితోట టోల్ ప్లాజా వద్దకు వస్తే అంద జేస్తామని నమ్మించారు. నిజమని భావించిన చంద్రరావు డబ్బుతో అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన కిరాయి వ్యక్తులు ఐదుగురు చంద్రరావుపై దాడి చేశారు. తెచ్చిన నగదు రూ.2 లక్షలు దోచుకుపోయారు. చంద్రరావు మొగల్తూరు పోలీసుల్ని ఆశ్ర యించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, వెంకటరెడ్డిపై అనుమానం వచ్చిందన్నారు. లోతైన విచారణ చేయగా మొత్తం కేసు మిస్టరీ వీడిందన్నారు. మంగళవారం ఉదయం నిందితులంతా పట్టణంలోని ఓ లాడ్జీలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ 1.75 లక్షల నగదు, రెండు బైక్‌లు, పది విదేశీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐలు యాదగిరి, ప్రసాద్, ఎస్సై వాసు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్.. రూ.10 వేల జరిమానా

భీమవరం క్రైం, అక్టోబరు 1 : గత నెల 29వ తేదీన భీమవరం రెండవ పట్టణం పరిధిలో ఏఎస్ఆర్ నగర్ జమ్మిచెట్టు వద్ద మద్యం సేవించి బైక్ నడుపుతున్న కె.భాస్కర్, డి.రమేష్‌లను భీమవరం టూటౌన్ సీఐ కాళీచరణ్ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో అరెస్టు చేశారు. వారిని భీమవరం స్పెషల్

## క్రైమ్ కార్నర్

జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద హజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. బహిరంగంగా మద్యం తాగడం, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

### అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

భీమవరం క్రైం, అక్టోబరు 1: అనారోగ్య సమస్యల కారణంగా నొప్పి భరించలేక ఒక వ్యక్తి గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నర్సయ్య అగ్రహారానికి చెందిన కవల మణికంఠ (32) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈనెల 30వ తేదీన సినిమాకు వెళుతున్నానని చెప్పి లెప్రసీ కాలనీ సమీపంలో ఖాళీస్థలంలో గడ్డి మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ దేవరాజు తెలిపారు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### ఇంటి స్థల వివాదం..మహిళ బలవన్మరణం



దెందులూరు/ఏలూరు క్రైం, అక్టోబరు 1 : ఇంటి స్థలం గొడవ నేపథ్యంలో ఒక వివాహిత పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలు దేవినేని రామతులసి (53) ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం వివరాలు ఇవీ. దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో ఆమెకు 493 గజాల ఇంటి స్థలం ఉంది. ఆ స్థలాన్ని గుడిపాడు మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన దొడ్డవరపు కోటేశ్వరరావు అతని భార్య నిర్మల దొంగ రిజిస్ట్రేషన్ చేయిం చుకున్నారని అందుకు కొవ్వలికి చెందిన వల్లభనేని సాయికృష్ణ సహక రించాడని దీనిపై గొడవలు జరుగుతున్నాయని పేర్కొంది. ఈ స్థల వివా దంపై కోర్టులో కేసు ఉండగా కోటేశ్వరరావు, నిర్మల ఆ స్థలంలో మోటారు, ఇతర వస్తువులను అపహరించడంతో రామతులసి దెందులూరు పోలీసు లకు ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసులు మాత్రం కోటేశ్వరరావు, నిర్మలాలు కలిసి రామతులసిపై ఆమె కుమారుడిపై ఫిర్యాదు చేశారని, ఆధార్ కార్డులు తీసుకుని సంతకాలు చేసి పంపించారని చెప్పారు. మంగళ వారం మధ్యా హ్నం కోటేశ్వరరావు, నిర్మల వచ్చి ఆ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిం చగా రామతులసి అడ్డుకుంది. వారిద్దరు కలిసి రామతులసిని దుర్భాష లాడడంతో తీవ్ర మనస్థాపానికి గురై అప్పటికప్పుడే ఇంట్లో ఉన్న పెట్రోల్ తెచ్చుకుని తనపై పోసుకుని అంటించుకుంది. తీవ్ర గాయాలపాలైన ఆమెను కుమారుడు, ఇరుగు పొరుగువారు కలిసి ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి విజయవాడ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

## డ్వాక్రా ఆర్పీల చేతివాటం

**రద్దయిన గ్రూపుతో బ్యాంకులో రూ.18.57 లక్షల రుణం**

**పోర్జరీ సంతకాలతో టోకరా**

**వెలికితీసిన సీవోపై ఆర్పీల బంధువుల దాడి**



చికిత్స పొందుతున్న సీవో సత్యనారాయణ.. బ్యాంకు ఓచర్

నరసాపురం టౌన్, అక్టోబరు 1: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా రుణాల్లో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుంది. ఫోర్జరీ సంతకాలతో బ్యాంకుల్లో లక్షల రూపాయలు స్వాహా చేశారు. కొత్తగా వచ్చిన కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో) సత్యనారాయణ వీటిని వెలికితీయడంతో అతనిపై దాడికి పాల్పడి గాయపర్చారు. దాడికి పాల్పడిన ఆర్పీల బంధు వులు సత్య నారాయణ లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీవో కూడా ఫిర్యాదు చేయడంతో ఇరుపక్షాల ఫిర్యాదుల్ని నమోదు చేశారు. బాధితుడు సత్యనారాయణ, సీఐ యాదగిరిలు చెప్పిన వివరాలు ఇవీ..

గతంలో నరసాపురం పురపాలక సంఘంలో సీవోగా సత్యనారాయణ పని చేసి మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. కొత్త ప్రభుత్వం వచ్చాక సీవోగా నరసాపురం వచ్చారు. బ్యాంకుల్లో సక్రమంగా రుణాలు చెల్లించని డ్వాక్రా గ్రూప్‌ల వివరాలు తెలుసుకునేందుకు బ్యాంకులకు వెళ్లగా ఓ బ్యాంకులో రూ 18.57 లక్షలు రుణం తీసుకుని మూడు నెలలు కట్టకుండా ఉన్న విషయం వెలుగుచూసింది. గ్రూప్ సభ్యుల్ని అడగగా తమకు తెలియదని చెప్పారు, దీంతో ఆర్పీలుగా ఉన్న దుర్గాభవాని, లక్ష్మిలను నిలదీయగా అసలు విషయం బయటకొచ్చింది. వీరిద్దరూ రద్దయిన ఒక గ్రూప్‌లోని ఏడుగురి సభ్యుల పేర్లు తీసుకొని వీరిద్దరితో పాటు మరొకరిని చేర్చుకుని కుషల్ స్వయం సహాయక గ్రూప్ సృష్టించి రుణం తీసుకున్నారు. రద్దయిన గ్రూప్‌లోని ఏడుగురి సంతకాలు వీరే పెట్టేశారు. ఫీల్డ్ అధికారిని మేనేజ్ చేసి గ్రూప్ పేరున చెక్కు తీసుకొని సొమ్ము కాజేశారు. అయితే వీరు తీసుకున్న రుణం సొమ్ము ప్రతినెల సక్రమంగా జమ చేయకపోవడంతో అసలు విషయం బయట పడింది.దీనిపై కొత్తగా వచ్చిన బ్యాంకు సిబ్బంది దృష్టి పెట్టారు. ఈక్రమంలో సత్యనారాయణ బ్యాంకుకు రాగా ఆయన దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఆయన ఆర్పీలిద్దర్ని నిలదీయగా డబ్బులు కట్టేస్తామని బ్యాంకుకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. సత్యనారాయణ ఈ విషయాన్ని వెలికి తీశారన్న కోపంతో సోమవారం జరుగుతున్న డ్వాక్రా సమావేశంలో సత్యనారాయణపై ఇద్దరి అర్పీల బంధువులు దాడికి పాల్పపడ్డారు. ఆర్పీలు మాట్లాడుతూ సత్యనారాయణ ఆరోపణల్లో నిజం లేదని నిబంధనల ప్రకారం రుణాలు తీసుకుని సభ్యులకు ఇచ్చామని వారు కట్టకపోతకే తామే కడతామని చెప్పారు.దీనిపై సీఐ యాదగిరి మాట్లాడుతూ ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామన్నారు.ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి మోసాలు గత ప్రభుత్వ హయాంలో చాలా జరిగాయని ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయన్నారు.

## నేడు ఏపీటీఎఫ్ జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 1 : ఏపీటీఎఫ్ జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు నగరంలోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించనున్నట్టు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు-విద్యారంగంపై వాటి ప్రభావం, విద్యారంగ పరిస్థితులపై చర్చాగోష్టులు, వక్తల ప్రసంగాలు ఉంటాయని వివరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.మంజుల, ప్రధాన కార్యదర్శి భాను మూర్తి తదితరులు హాజరవుతారని తెలిపారు.

## ఆర్‌ఎల్‌జేపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆసిస్ గుప్తా


ఆసిస్ గుప్తాను అభినందిస్తున్న జాన్‌వెస్లీ

ఏలూరు రూరల్, అక్టోబరు 1: రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ (ఆర్ ఎల్‌జేపీ)యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా విశాఖపట్నంకు చెందిన ఆసిస్ గుప్తాను నియమించారు. ఏలూరులో రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఆసిస్ గుప్తాను నియమిస్తూ నియామకపత్రాన్ని అందచేశారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌ఎల్‌జేపీ జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాల్‌మనీ గ్యాంగ్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 1 : వడ్డీకి సొమ్ములు ఇచ్చి వడ్డీపై వడ్డీ వేసి దోపిడీలకు పాల్పడుతూ బెదిరిస్తూ శారీరకంగా, మానసికంగా చిత్ర హింసలకు గురి చేస్తున్న కాల్‌మనీ నిర్వాహకులపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు దక్షిణపువీధికి చెందిన ఐలూరి సుబ్బలక్ష్మి భర్త రాజేష్ పౌరోహిత్యం చేస్తుంటారు. ఏలూరుకు చెందిన వడ్డీ వ్యాపారి మేడపాటి సుధాకర్‌రెడ్డి 2011లో అప్పు తీసుకుని తిరిగి చెల్లించారు. మళ్లీ 2019లో రూ.లక్షా 20 వేలు తీసుకుని ప్రతి వారం రూ.ఐదు వేలు వడ్డీ కట్టారు. అలా రూ.ఆరు లక్షలు కట్టారు. ఫోన్‌పే ద్వారా మరో రూ.8 లక్షల 75 వేల 900లు కట్టారు. కానీ అప్పు తీసుకున్న సమయంలో సుబ్బలక్ష్మి తండ్రి చేత కూడా తీసుకున్న చెక్కులు, నోట్లు, తెల్లకాగితాలు అడ్డంపెట్టి అప్పు ఇంకా తీరలేదని కోర్టులో కేసులు వేసి బెదిరిస్తున్నారు. ఆమె ఇంట్లో ఉన్న ఏసీ, స్కూటర్, ఇతర వస్తువులను సుధాకర్‌రెడ్డి అతని భార్య లావణ్య, విద్యాసాగర్, రాజేష్, మరి కొంతమంది కలిసి దౌర్జన్యంగా పట్టుకుపోయారు. అంతేకాకుండా ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ అవమాన పరిచారు. దీంతో బాధితురాలు వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ వారందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పైడిచింతపాడులో ఉద్రిక్తత

ఏలూరు రూరల్, అక్టోబర్ 1: ఏలూరు రూరల్ మండలంలో కూటమిలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. కొల్లేరు లంక గ్రామమైన పైడిచింతపాడులో పింఛన్ పంపిణీలో టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరికి ఒకరు తోపులాడుకున్నారు. సర్పంచ్ ముంగర తిమోతిపై దాడికి తెగబడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతిప చేశారు. పైడిచింతపాడు సచివాలయంలో ఉదయం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ జరిగింది. ఇటీవల గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు, వైసీపీ సర్పంచ్ ముంగర తిమోతితో సహా జనసేన పార్టీలో చేరారు. వీరంతా పార్టీ కండువాలు కప్పుకుని పింఛన్ పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో పలువురు టీడీపీ నాయకులు, సర్పంచ్ పింఛన్లు పంపిణీ చేసేందుకు వీలు లేదంటూ అడ్డగించారు. సచివాలయంలోకి వెళ్ళకుండా అడ్డుకున్నారు. తామే పింఛన్లు పంపిణీ చేస్తామనిన మీకు సంబంధం లేదంటూ టీడీపీ నాయకులు వారిని అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. తోపులాట చోటు చేసుకుంది. సర్పంచ్‌కి ప్రొటో కాల్ ఉంటుందని సర్పంచ్‌ని కాదని తామే పింఛన్లు పంపిణీ చేస్తామంటూ టీడీపీ నాయకులు పేర్కొనటంపై జనసేన నాయకులు అభ్యంతరం తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఎంపీడీవో బండి ప్రణవి చేరుకుని సర్దుబాటు చేసి ఇరు వర్గాలను శాంతింప చేశారు. దీంతో ఇరువ ర్గాల నాయకులు శాంతించి ఎంపీడీవో చెప్పిన విధంగా సహకరిస్తామంటూ ఇరు వర్గాల పార్టీ నాయకులు తెలియ చేయడంతో వివాదం సర్దుమణిగింది.

# పింఛన్ల పెంపు హామీ నెరవేర్చాం


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 1: ఎన్నికల వాగ్దానం మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను రూ.4 వేలకు పెంచామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. నగరంలోని 30, 32వ డివిజన్‌లలో ఎమ్మెల్యే చంటి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అర్హులైన వారికి నూతన పింఛన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. నగర కమిషన్ ఎ.భానుప్రతాప్, టీడీపీ నేతలు చోడే వెంకటరత్నం, పప్పు ఉమామహేశ్వరరావు, ఎస్ఎంఆర్ పెదబాబు, ఎంఆర్‌డీ బలరామ్, పూజారి నిరంజన్, నాయుడు సోము, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### నేటి నుంచి కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

అర్హులకు కొత్తపింఛన్లు మంజూరు చేసేందుకు బుధవారం గాంధీజయంతి నుంచి అన్ని సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) తెలిపారు.

## 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

### జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు సిటీ, అక్టోబరు 1: జిల్లాలో మధ్యాహ్నం నాలుగు గంటలకే 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మొత్తం 2,64,966 మంది పెన్షన్లు పొందుతుండగా వారిలో మధ్యాహ్నంకి 2,52,089 మందికి పంపిణీ పూర్తయిందన్నారు. రూ. 113.24 కోట్లకు రూ. 107.69 కోట్లు (95 శాతం) పంపిణీ పూర్తి చేశారన్నారు. ఇందుకోసం 5,174 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందిని నియమించామన్నారు. అనివార్య కారణాలతో అక్టోబరు ఒకటిన పెన్షన్ తీసుకోని వారికి అక్టోబరు మూడున అందజేస్తామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, నగరపురపాలక కమిషనర్ ఎన్.భానుప్రతాప్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ

ఏలూరు రూరల్, అక్టోబర్ 1: ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాలు స్వీకరణ, పరిశీలన చక్కగా ఉండాలని, ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో వివేక్ యాదవ్ తెలిపారు. అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. కమిషన్ మార్గదర్శ కాలను అనుసరించి నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ ముందు కలెక్టర్ వెట్రిసెల్వి కాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతూ ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ ఏలూరు జిల్లాలో 98.68 శాతం పూర్తి అయిందని, జాబితాలో సవరణకు 82,851 దరఖాస్తులు అందాయని, వాటిలో 2,453 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నెల 3లోగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి క్లెయిములు పరిష్కరించాలన్నారు.

## ఉత్సాహంగా సైక్లోథాన్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, అక్టోబరు 1: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. స్వచ్ఛ తా హీ సేవాలో భాగంగా మంగళవారం స్థానిక జ్యూట్ మిల్లు సెంటర్లోని అల్లూరి సీతా రామరాజు విగ్రహం నుంచి నిర్వహించిన సైక్లోథాన్ సైకిల్ ర్యాలీలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. తొలుత పరిసరాల పరిశుభ్రం కోసం శ్రమదానానికి సమయాన్ని కేటాయిస్తామని ప్రతిజ్ఞ నిర్వహించారు. ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి జెండా ఊపి ప్రారంభించారు. పురవీధుల గుండా ర్యాలీ సాగింది. కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

### సీఆర్‌ఆర్ కళాశాలలో...

ఏలూరు అర్బన్, అక్టోబరు 1 : స్వచ్ఛతా హీ సేవా భాగంగా మంగళవారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కెడెట్లు, విద్యార్థులు గార్బేజ్ ఫ్రీ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణలో, వెలుపలవున్న గడ్డి, చెత్తను తొలగించి శుభ్రం చేశారని ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, వైస్ ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, పీజీ డైరెక్టర్ యలమర్తి బాబు, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ లావణ్య, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్లు శంకర్, భాషా, శ్రీధర్ పాల్గొన్నారు.

## నేత్రపర్వం..ఏకాదశ రుద్రాభిషేకం



ద్వారకాతిరుమల, అక్టోబ రు 1: క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో మంగళ వారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తులను అలరించింది. మాస శివరా త్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషేకం చేశారు. రాత్రి నందివాహనంపై జరిగిన గ్రామోత్సవం నిర్వహించారు.

## నిధుల గోల్‌మాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ద్వారకాతిరుమల, అక్టోబరు 1: రామన్నగూడెం పంచాయ తీ పరిధిలో మూడేళ్లుగా రూ.20 లక్షల నిధులు గోల్‌మాల్ అయ్యాయని గ్రామానికి చెందిన కొత్తపల్లి రమేష్ అనే వ్యక్తి కలెక్టర్‌కు సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్టు మంగళవారం విలేకర్లకు తెలిపారు. పంచాయతీ పరిధిలో గతంలో పనిచేసిన కార్యదర్శులు నాగరాజు, కృష్ణవేణి, సర్పంచ్‌తో కుమ్మక్కై ఈ నిధులను స్వాహా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే పంచాయతీలో పదేళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తున్న కొండపల్లి సహదేవుడు తనకు రావాల్సిన 15 నెలల జీతాన్ని నాగరాజు అనే కార్యదర్శి వాడుకుని తన ఇంతవరకూ ఇవ్వలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుబ్బరాయన్ వివరణ ఇస్తూ తన దృష్టికి రాలేదన్నారు.

## పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

ద్వారకాతిరుమల, అక్టోబరు 1: ప్రతీ విద్యార్థికి చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తోందని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు కృష్ణ తెలిపారు. తిరుమలంపాలెం జడ్పీహెచ్ స్కూల్‌లో మంగళవారం ఆయన వినియోగదారుల క్లబ్‌ను ఏర్పాటు చేసి అవగాహనాన సదస్సు నిర్వహించారు. క్లబ్ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

## ధ్రువీకరణ పత్రాల జారీలో నిబంధనలు పాటించాలి

ఏలూరు సిటీ, అక్టోబరు 1: అస్సైన్డ్ భూములు, కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశాలలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని డివిజినల్ రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, భూపరి పాలనా ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, రెవెన్యూ రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారులు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అస్సైన్డ్ భూముల ప్రక్రియ వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ తనిఖీ, భూములు, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించిన అర్జీలు, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ అంశాలపై జేసీలు, డీఆర్‌వోలు, ఆర్డీవోలతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని రెవెన్యూ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ పై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి పెండింగ్ అంశాలపై దృష్టి సారించాలన్నారు. అర్హులందరికీ న్యాయం చేకూర్చాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూసమస్యలపై వచ్చే ప్రతి అర్జీని పూర్తిగా అవగాహన చేసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌వో డి.పుష్పమణి , జిల్లా రిజిస్ట్రార్ అధికారులు, ఆర్డీవోలు , కలెక్టరేట్‌లోని పరిపాలనా విభాగం సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, అక్టోబరు 1 : వృద్ధులు తమకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఏలూరు పత్తేబాదలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రత్న ప్రసాద్ వసతి గృహంలో ఉన్న వృద్ధులకు ఎటువంటి న్యాయసహాయం కావాల్సిన ఉచితంగా అందిస్తామన్నారు, ప్రభుత్వ పథకాలను వైద్య సదుపాయలను పొందడంలో ఎటు వంటి సహాయం కావాల్సి వచ్చినా తమ పారాలీగల్ వాలంటీర్ల ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వసతి గృహం మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### వయోవృద్ధులకు సత్కారం

ఏలూరు అర్బన్, అక్టోబరు 1 : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని స్థానిక శ్రీరాంనగర్ జింగిల్ బెల్స్ స్కూలులో మంగళవారం నిర్వహించారు. సమాజ సేవకులు, సీనియర్ అడ్వకేట్ కూన కృష్ణారావు, రిటైర్డ్ కాలేజి టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లేళ్ళ వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, సేవలు సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలి

ఏలూరు రూరల్, అక్టోబర్ 1: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని, వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణకు అవలంభిస్తున్న దుశ్చర్యను నిరసిస్తూ ఐక్య విద్యార్థి యువజన సంఘాల పిలుపుమేరకు మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. దీక్షకు ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా మాజీ కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వైసీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడిపల్లి జయప్రకాష్ తదితరులు సంఘీభావం తెలిపారు. పలువురు నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును సెయిల్లో విలీనం చేయాలని, సొంత ఘనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సాయంత్రం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సోమయ్య నిమ్మరసాన్ని ఇచ్చి నిరాహార దీక్షను విరమించారు. శివకుమార్, టి.రాజు, నాగరాజు, కృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ నగరంగా తీర్చుదిద్దుతా..

### నూతన కమిషనర్ భానుప్రతాప్



ఏలూరు టూ టౌన్, అక్టోబరు 1: స్వచ్ఛ నగరంగా తీర్చుదిద్దుతా. పచ్చదన, పరిశుభ్రతే నా ధ్యేయం. డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి ఎప్పటి మురుగు అప్పుడే పారే విధంగా కృషి చేస్తా. అక్రమ కట్టడాల పై ఉక్కుపాద మొపుతా. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి నగర ప్రజల కల సహకారం చేస్తా. అవినీతి రహిత పాలన అందించేందుకు కృషి చేస్తాను. ఇది నగర పాలక సంస్థ నూతన కమిషనర్ భానుప్రతాప్ అంతరంగం.

**ప్రశ్న : స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?**

జవాబు : స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్య కార్మికులు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి నగరాన్ని శుభ్రం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పోడిచెత్తను సేకరిస్తున్నారు. నగరంలో 62 క్లాప్ వాహనాలతో సేకరించిన చెత్తను పోణంగిలోని డంప్పింగ్ యార్డుకు తరలిస్తున్నాం.

**ప్రశ్న : డ్రైనేజీ వ్యవస్థ మెరుగదలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

జవాబు : డ్రైన్లను ఒకదానికి ఒకటి అనుసంధానం చేస్తాం. డ్రైన్లలోని ఎత్తుపల్లాలను సరి చేస్తాం. మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. డ్రైన్లలో ఎటువంటి ప్లాస్టిక్ చెత్తా చెదారం వేయకుండా ప్రజలు కూడా సహకరించండి.

**ప్రశ్న : దోమలు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

జవాబు : నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా పెరగకుండా మలేరియా సిబ్బంది ఆయిల్‌బాల్స్ వేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఫాగింగ్ చేస్తున్నాం. డ్రైన్లలో దోమల మందు పిచికారీ చేస్తున్నాం.

**ప్రశ్న : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

జవాబు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జూలై ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విస్తృత ప్రచారం నిర్వహించాం. వర్షాకాలంలో అతిసారం సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాం.

**ప్రశ్న : అనధికార కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?**

జవాబు : నగరంలో అనధికార కట్టడాల పై రాజీపడే ప్రసక్తి లేదు. ఎంతటివారైన సరే అక్రమ కట్టడాలు కడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముందుగా నోటీసులు జారీ చేసి హెచ్చరిస్తాం. అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మొపుతాం.

**ప్రశ్న : అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎప్పటికి పూర్తవుతుంది ?**

జవాబు : నగరంలో ఇప్పటికే 2టౌన్‌లో ఆరు డివిజన్లలో రూ.38 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నిర్మాణంలో ఉన్నాయి. తంగెళ్ళమూడిలో మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం పూర్తయ్యింది. దానికి అండర్ గ్రౌండ్‌లో పైపులు వేసి అనుసంధానం చేయాలి. వన్‌టౌన్ ఏరియాలో రూ.112 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆమోదం పొందిన తరువాత టెండర్లు పిలుస్తాం.

**ప్రశ్న : పైపులైన్ల లీకేజీలను సరిచేస్తారా ?**

జవాబు : తాగునీటి సరఫరాకి 50 ఏళ్ల క్రితం వేసిన భూగర్భ పైపులైన్లు ఉన్నాయి. అక్కడక్కడ కొంచెం లీకేజీలు ఉన్నా. వెంటనే గుర్తించి సరి చేస్తున్నాం. అవసరమైన చోట కొత్తపైపులు వేస్తున్నాం.

**ప్రశ్న : సిబ్బందిలో అవినీతిని ఎలా అరికడతారు ?**

జవాబు : సిబ్బందిలో అవినీతిని సహించేదిలేదు. ప్రజల నుంచి ఎటువంటి లంచాలు ఆశించకుండా సిబ్బంది పని చేయాలి. ఆ దిశగా ఇప్పటికే సిబ్బంది కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం. విచారణలో అవినీతి అని రుజువైతే తగు చర్యలు తీసుకుంటాం.

# సంపద కేంద్రాల దశ తిరిగేనా?

**» వైసీపీ పాలనలో నిర్లక్ష్యం » తుప్పు పట్టిన యంత్రాలు » కేంద్రాల్లో అసాంఘిక కార్యకలాపాలు**


రామవరంలో సంపద కేంద్రానికి తలుపులు కూడా లేని దృశ్యం

**గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. చెత్తకు పన్ను వేసి ముక్కుపిండి ప్రజల నుంచి వసూలు చేసిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ళుగా పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.**

కైకలూరు, అక్టోబరు 1: కోట్లాది రూపాయిలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రాలు వృధాగా ఉండి అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి నిర్వహణపై దృష్టిపెట్టి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. గత 45 రోజులుగా సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం అక్టోబరు 2 నాటికి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో గ్రామాల్లో మరుగున పడిన చెత్త సంపద తయారీకేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పంచాయతీ అధికారుల ప్రయత్నాలు అంతంమాత్రమే... ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారుల బదిలీలను చేపట్టడంతో ఆయా పంచాయతీల కార్యదర్శులు ఈ బదిలీల గొడవలో పడి కనీసం సంపద కేంద్రాలను శుభ్రపరచిన దాఖలాలు కన్పించలేదు. కైకలూరు మండలంలోని రామవరం, వదర్లపాడు, గోనెపాడు, తదితర గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఈ చెత్త సంపద తయారీ కేంద్రాల వద్దే మందుబాబులు మందు తాగి సీసాలను అక్కడే పడవేశారు. ఎక్కడికక్కడ తొట్టెల్లో మందుసీసాలు, వాటర్ ప్యాకెట్ కవర్లు దర్శనమిస్తున్నాయి. నాడు టీడీపీ ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన ఈ సంపద తయారీ కేంద్రాలను రూ.5 లక్షలు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. మరికొన్ని చోట్ల రూ.3లక్షల చొప్పున కేటాయించి చెత్త సంపద తయారీ కేంద్రాలను నిర్మాణం చేసింది. 116మంది జనాభాకు క్లాప్‌మిత్రాలను విధుల్లోకి తీసుకుంది. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ సంపద కేంద్రాలను పూర్తిగా విస్మరించింది. దీంతో గ్రామాల్లో రహదారుల వెంబడి చెత్త పేరుకుపోయింది. గ్రామపంచాయతీల నిధులు, 15వ ఆర్థికసంఘం నిధులు సైతం వైసీపీ ప్రభుత్వం కొల్లగొట్టడంతో చేసేది లేక వీటి నిర్వహణ అధికారులు గాలికొదిలేశారు. వినియోగంలోకి వచ్చిన కేంద్రాలను కూడా పట్టించుకో కపోవడంతో యంత్రాలు తుప్పుపట్టిపోయాయి. క్లాప్ మిత్రాలకు రెండేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోవడంతో వారు మరో వృత్తిని ఎంచుకొని వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం చెత్తను సేకరించే క్లాప్‌మిత్రాలు అందుబాటులో లేక వీటి వినియోగం ప్రశ్నార్థకంగా మారింది. కైకలూరు మండలంలో 26 గ్రామ పంచాయతీలకు గాను 24 పంచాయతీల్లో సంపద కేంద్రాలను నిర్మించారు. అయితే వీటిలో కొల్లేరు గ్రామాలైన శృంగవరప్పాడు, గుమ్మళ్ళపాడు, పందిరిపల్లిగూడెం, పెంచికలమర్రు, కొట్టాడ గ్రామాల్లోని కేంద్రాలు కొల్లేరు వరద ఉధృతికి నీట మునిగాయి. కైకలూరు గ్రామ పంచాయతీలో కేంద్రాన్ని నేటికీ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం కైకలూరు-ఏలూరు ఆర్‌అండ్‌బీ రహదారిపై చెత్తను పోస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డు నిర్మాణానికి స్థల సేకరణకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చర్యలు చేపట్టారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నాయి. గత ఐదు సంవత్సరాలు వీటి ఆలనాపాలనా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాటు క్లాప్ మిత్రాలకు జీతాలు కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం చెత్తసేకరణ అంటే ప్రభుత్వానికి సవాల్‌గానే మారుతుంది.


తొట్టెల్లో ఖాళీ మద్యం సీసాలు.. తుప్పుపట్టి పాడైన రిక్షా

## ట్రిపుల్ ఐటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా నాగార్జునదేవి

నూజివీడు టౌన్, అక్టోబరు 1: ఆర్జీయుకేటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా డాక్టర్ నాగార్జునదేవి నియమితులయ్యారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీఎస్‌ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెను ఆర్జీయూకేటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నూజివీడు క్యాంపస్‌లో డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా ఆమె పని చేశారు.

## చాట్రాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాణి

చాట్రాయి, అక్టోబరు 1: చాట్రాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా జి. రాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముసునూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమెను చాట్రాయి ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ రిటైరు కావటంతో ఈ నియామకం జరిగింది.

## ఎక్సైజ్ సీఐగా మస్తానయ్య

నూజివీడు, అక్టోబరు 1: నూజివీడు ఎక్సైజ్ సీఐగా ఎ.మస్తానయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని లిక్కర్ షాప్‌లకు ఈ నెల 9వ తేదీ వరకు టెండర్లు స్వీకరిస్తామని, 11న లాటరీ ద్వారా లిక్కర్ షాపులను కేటాయిస్తామని తెలిపారు. నూజివీడు పట్టణంలో 4, మండల పరిధిలో 2, ఆగిరిపల్లి మండలంలో 4, ముసునూరు మండలంలో 3, చాట్రాయి మండలంలో 3 మొత్తం 16 లిక్కర్‌షాపులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

## రైల్వే కమిటీ సభ్యుడిగా లక్ష్మణరావు

ముదినేపల్లి, అక్టోబరు 1 : దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా ముదినేపల్లి మండలం శ్రీహరిపురం శివారు చేవూరుపాలెంకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మేలిమి లక్ష్మణరావు (చిట్టిబాబు) నియమితులయ్యారు. రైల్వే శాఖలో డివిజన్ పరిధిలోని స్టేషన్ల నిర్వహణపై నిర్వహించే సంప్రదింపుల సమావేశాల్లో పాల్గొని తగిన సూచనలు చేస్తారు. లక్ష్మణరావును ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అభినందించారు.

## యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పద్మకిషోర్

ముసునూరు, అక్టోబరు 1: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా జి.పద్మకిషోర్, ప్రధాన కార్యదర్శిగా జి.రాంబాబులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ముసునూరులో యూటీఎఫ్ నూతన కమిటీని ఎన్నికున్నారు. గౌరవ అధ్యక్షులుగా జాకబ్‌రాజు, సహాధ్యక్షులుగా పుల్లయ్య, సత్యప్రియ, కోశాధికారిగా నారాయణతో పాటు మరో తొమ్మిది మంది కార్యదర్శులు, ఒక ఆడిటర్, 10 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సీనియర్ సభ్యులైన కె.వి. నారాయణరావు, డి.బెనర్జీ, పద్మలత, శాంతకుమారి, కె.గాంగేయుడు జిల్లా కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు.

## చిన్ననాటి నుంచే పొదుపు అలవడాలి

నూజివీడు, అక్టోబరు 1: చిన్ననాటి నుంచే విద్యార్థులు పొదుపును అలవర్చుకోవాలని గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీలక్ష్మి అన్నారు. నూజివీడు గురుకుల పాఠశాలలో మంగళవారం పోస్టల్ విభాగం ఆధ్వర్యంలో పదేళ్ల నిండిన ప్రతి విద్యార్థికి జీరో బ్యాలెన్స్ అకౌంట్‌ను ఓపెన్ చేశారు. ఆధార్, మొబైల్ నంబర్ ఆధారంగా విద్యార్థి స్కాలర్‌షిప్‌ను అకౌంట్లో పొందేందుకు పోస్టల్ విభాగం ఆధ్వర్యంలో ఈ ఖాతాలు తెరిచినట్టు శ్రీలక్ష్మి తెలిపారు.

## బార్ అసోసియేషన్ స్వచ్ఛతా హీ సేవ

నూజివీడు, అక్టోబరు 1: నూజివీడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టు హాల్ నుంచి మైలవరం ప్రధాన రహదారిని శుభ్రపరిచి పారిశుధ్య ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరి చేరవన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజలకు సమృద్ధిగా తాగునీరందించడమే లక్ష్యం

ముసునూరు, అక్టోబరు 1: అక్కిరెడ్డిగూడెం పంచాయతీ పరిధిలో ప్రజలకు సమృద్ధిగా మంచినీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 3 లక్షలతో వేస్తున్న మంచినీటి బోరు పనులను సర్పంచ్ మంగళవారం ప్రారంభించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మానురాజు సురేష్, కార్యదర్శి విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు

ముదినేపల్లి, అక్టోబరు 1 : ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మాగంటి బాపినీడు - సువర్చల స్మారక నగదు పురస్కారాలను అందజేశారు. మంగళవారం హైస్కూల్ హెచ్‌ఎం విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు హేమ రేవంత్, కరీమున్నీసా, హర్షిణి, స్రవంతి, ఎండీ హస్నా, దివ్య, అమల్, అనిత, జాహ్నవి, అభిలాష్‌లకు రూ.30 వేలు బాపినీడు కుటుంబీకుల తరపున వై.మాధవ్ కుమార్ అందజేశారు.

## మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

ముదినేపల్లి, అక్టోబరు 1 : ముదినేపల్లి మండల స్థాయి విద్యార్థుల ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో ఉత్తమ క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన సుమారు 120 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పోటీల కో-ఆర్డినేటర్ కోడే రోజా తెలిపారు.

## భక్తులకు అసౌకర్యం కలగనివ్వద్దు

కైకలూరు, అక్టోబరు 1: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి దసరా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో శ్రీ చండీ మహా యాగ సహిత శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ ఉత్సవాలకు ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భూ పోరాటాల్లో ముందుండాలి

ఆగిరిపల్లి, అక్టోబరు 1: భూ పోరాటాల్లో వ్యవసాయ కార్మికులు ముందుండాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రవి అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి సుందరయ్య నిలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా అన్ని రంగాల కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు.

## రాత్రికి రాత్రి రోడ్డుకు అడ్డంగా గోడ

ఆగిరిపల్లి, అక్టోబరు 1: ఆగిరిపల్లి బ్రాహ్మణ వీధిలో స్థానికులు సోమవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా గోడ కట్టేశారు. అక్కడ కొత్తగా నిర్మించిన కమర్షియల్ బిల్డింగ్‌లోని డ్రెయినేజీ వాటర్ తమ కాలనీలోని నేలబావిలో కలిస్తే తాము అనారోగ్యం పాలవుతామని, డ్రెయిన్‌ను మెయిన్ రోడ్‌లోని మేజర్ డ్రెయిన్‌లో కలుపుకోమని తాము కోరినా బిల్డింగ్ యజమాని వినిపించుకోలేదని ఆరోపిస్తూ అందువల్లే గోడ కట్టామని స్థానికులు తెలిపారు.



## ఏలూరులో సత్య ఏజెన్సీస్ షోరూం ప్రారంభం

ఏలూరు, అక్టోబరు 1: ఏలూరు నగరంలో సత్య ఏజెన్సీస్ షోరూం ఏర్పాటైంది. సీఎల్‌ఎన్ ఐకాన్ బిల్డింగ్‌లో ఈ షోరూంను సత్య కుటుంబీకులు రిబ్బన్ కత్తిరించి లాంఛనంగా ప్రారంభించారు. సత్య ఏజెన్సీస్ స్టేట్ హెడ్ సెంథిల్, సీనియర్ డివిజన్ ఇన్‌చార్జి ఆనంద్, వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సెంథిల్ మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి చెందిన కంపెనీలకు చెందిన ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ ఇక్కడ అందుబాటులో వుంటాయని తెలిపారు.

## గాంధీ ఆశ్రమం అభివృద్ధి ఏదీ?

### ఎండోమెంట్ ఈవోని నిలదీసిన ఐక్యవేదిక సభ్యులు

మండవల్లి అక్టోబరు 1: మండవల్లిలోని గాంధీ సేవాశ్రమానికి ఆదాయ వనరులున్నా ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎండోమెంట్ ఈవో దివ్యని నిలదీశారు. ఆశ్రమం భూముల ఆదాయంపై మంగళవారం ఈవో దివ్యను ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్‌ఎస్ భాస్కరరావు, మండవల్లి శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు, గాంధీ ఆశ్రమం మాజీ డైరెక్టర్ బండి రంగారావు ప్రశ్నించారు. గాంధీ జయంతి సందర్భంగా ఆశ్రమంలో ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు మంగళవారం వచ్చిన దివ్యని ఐక్యవేదిక కలిసి ఆశ్రమంలో చేపట్టవలసిన కార్యక్రమాలు వివరించారు. ఆశ్రమం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.



## వరద బాధితులకు సీఐటీయూ వితరణ

మండవల్లి అక్టోబరు 1 : సీఐటీయు ఆధ్వర్యంలో కాకతీయనగర్‌లో వరద బాధితులు వందమందికి నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేసింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. యూనియన్ జిల్లా నాయకులు కె. విజయలక్ష్మి, ఎన్. నాగలక్ష్మి, ప్రాజెక్టు లీడర్ చెల్లమ్మ, గన్నవరం సెక్టార్ లీడర్ జి. విజయలక్ష్మి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకుడు శివ తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై కోతుల దాడి



గాయపడిన వెంకటేశ్వరమ్మ వీపుపై గాయాలు

ముదినేపల్లి, అక్టోబరు 1: ముదినేపల్లిలో కోతులు స్వైర విహారం చేస్తున్నా యి. తాటాకు ఇళ్ల పై కప్పులు పీకేయటమే కాక, ఇళ్లలోని తినుబండారాలను కూడా ఎత్తుకుపోతున్నాయి. అడ్డగిస్తే దాడి చేస్తున్నాయి. మంగళవారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లో కోతులు మరింత రెచ్చిపోయాయి. కారే వెంకటేశ్వరమ్మ అనే మహిళపై దాడి చేశాయి. కోతులు ఉన్నట్లుండి దాడికి దిగటంతో ఆ మహిళ కింద పడి పోగా, కాళ్లు, మెడ, చేతులపై కరిచాయి. కొంతమంది కర్రలతో రావటంతో కోతులు పారిపోయాయి. వెంటనే వెంకటేశ్వరమ్మను ఆమె భర్త కోటేశ్వరరావు తదితరులు ముదినేపల్లి పీహెచ్‌సీకి తరలించారు. కోతుల సమస్యను ఎన్నోసార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు కోరారు.

## క్రైం కార్నర్..

### సరదాగా చెరువులో స్నానానికి దిగి..


నారాయణ మృతదేహం

కైకలూరు, అక్టోబరు 1: సరదాగా చెరువులో స్నానానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కైకలూరుకు చెందిన గోపాలపురపు త్రినాథ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు నారాయణ (19) ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటున్నాడు. మంగళవారం స్నేహితులతో కలసి మండలంలోని గోపవరం గ్రామానికి వెళ్లి ఓఎన్జీసీ రోడ్డులోని రజకుల చెరువులో స్నానానికి దిగాడు. చెరువు లోతుగా ఉండడంతో నారాయణ నీట మునుగుతూ బిగ్గరగా కేకలు వేయగా అప్పటికే చెరువులో దిగుతున్న గుణ అనే యువకుడు కాపాడేందుకు యత్నిం చాడు. అతను కూడా మునిగి పోతుండగా స్థానికులు కాపాడారు. నారాయ ణ కోసం గాలించి వెలికితీయగా అప్పటికే అతను మృతి చెంది ఉన్నాడు. గుణను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని నారాయణ మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చెల్లని చెక్కు ఇచ్చినందుకు జైలు

నూజివీడు టౌన్, అక్టోబరు 1: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. తాడేపల్లిగూడెంకు చెందిన ప్రత్తిపాటి లూకరాజు 2019లో నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్ నుంచి రూ.4 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు చెక్కు ఇవ్వగా బ్యాంక్‌లో నగదు లేదని చెక్కును తిప్ప పంపారు. దీంతో ప్రవీణ్ నూజివీడు ప్రత్యేక న్యాయస్థానంలో కేసు దాఖలు చేయగా విచారణ జరిపిన న్యాయమూర్తి కృష్ణమూర్తి ముద్దాయి లూకరాజుకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

### కబేళాకు తరలిస్తున్న ఆవుల స్వాధీనం

నూజివీడు, అక్టోబరు 1: అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఆవులను నూజివీడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మైలవరం మండలం చంద్రాల నుంచి నంద్యాలకు తరలిస్తున్న ఆవుల లారీని మంగళవారం తెల్లవారు జామున నూజివీడు పెద్దగాంధీ బొమ్మ సెంటర్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నూజివీడు పట్టణ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆవులు తరలింపుపై విచారణ నిర్వహించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.


కైకలూరులో మాట్లాడుతున్న న్యాయసేవాధికారి లక్ష్మి


నూజివీడు సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి కె.హరిబాబు

## వృద్ధులపై వివక్ష చూపితే చర్యలు

కైకలూరు, అక్టోబరు 1: వృద్ధులను వివక్షకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కైకలూరు సీనియర్ న్యాయ సేవాధికారిణి వీవీఎస్వీ లక్ష్మి అన్నారు. మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పట్ల వివక్ష చూపితే చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చన్నారు. అలాగే పెద్దల ఆస్తులు పిల్లలకు ఇచ్చే సమయంలో గిఫ్ట్‌గా రాయాలని వాటిలో తల్లిదండ్రులను వారే సంరక్షించాలి అనే పదాన్ని కచ్చితంగా రాయించుకోవాలన్నారు. ఇలా రాసిన వారిపట్ల వారి పిల్లలు వివక్ష చూపితే రాసిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రులు తీసుకోవచ్చన్నారు. సీనియర్ సిటిజన్స్ యాక్ట్ అమలులో ఉందని అందువలన ఎవరైనా వృద్ధులు ఇబ్బందులు పడితే కోర్టులను ఆశ్రయించవచ్చని సూచించారు. న్యాయవాదులు పి. పవన్‌కాంత్, బోడావుల ఇందిర, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నూజివీడు టౌన్:** వృద్ధుల సంక్షేమానికి చట్టపరంగా అనేక చర్యలు తీసుకుంటున్నట్టు నూజివీడు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.హరిబాబు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి వృద్ధులకు చట్టపరంగా అందిస్తున్న సేవలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రకాష్, సంఘ అధ్యక్షుడు పిచ్చయ్య, గౌరవాధ్యక్షుడు లక్ష్మణస్వామి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

## టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా

కైకలూరు, అక్టోబరు 1: టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాద బీమాను కల్పించారని పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు తెలిపారు. మంగళవారం కైకలూరులో పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వాలను గతం కంటే ఎక్కువ నమోదయ్యేలా శ్రేణులు కృషి చేయాలన్నారు. రూ.100లు సభ్యత్వం చెల్లిస్తే రూ.5 లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 2021 సంవత్సరానికి డిగ్రీ పూర్తయిన ప్రతి యువతీ, యువకుడు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. వంద రోజుల పాలన వరదలు, జగన్ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికితీయడానికే సమయం సరిపోయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో మరికొన్ని రోజుల్లో ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మెంటే పార్థసారథి, కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్లు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, కొడాలి వినోద్, బలే ఏసురాజు, తేరా రమేష్‌బాబు, టీడీపీ నాయకులు, మండలపార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

## సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



నూజివీడు టౌన్, అక్టోబరు 1: సమగ్ర సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నీలి రాజు అన్నారు. వెంకటా ద్రిపురంలో నిర్వహించిన పొలం పిలు స్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మామిడిలో పురుగు నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏడీఏ విద్యాసాగర్, ఏవో చాముండేశ్వరి, హెచ్‌వో హేమ తదితరులు పాల్గొన్నారు.

**ముసునూరు:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు ముంగిటకు చేర్చడమే పొలం పిలుస్తోంది ముఖ్య ఉద్దేశమని ఏవో మధుమోహన్ అన్నారు. మంగళవారం గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో జరిగిన పొలంబడిలో ఆయన రైతులకు పంటల సస్యరక్షణ తదితర వాటిపై అవగాహన కల్పించారు. డ్రోన్ వినియోగంతో కూలీల కొరతను అధిగమించవచ్చని తెలిపారు.

**ముదినేపల్లి:** మండలంలోని చిగురుకోట, పెదకామనపూడి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించింది. ఏవో వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏడీఏ వెంకటమణి ముంపు నుంచి తేరుకున్న వరి పైరును కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించి భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా వరి సాగును నిర్వహించాలని తెలిపారు. పశువుల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి క్రాంతి కుమార్ వివరించారు.

## కార్మికులు సంఘటితంగా పోరాడాలి

కైకలూరు, అక్టోబరు 1: కార్మికులంతా సంఘటితంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సంగిరెడ్డి దుర్గారావు అన్నారు. మంగళవారం కైకలూరు కార్మిక సంక్షేమ సంఘ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు సభ్యత్వాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, దానిని ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ సబిత, బీఎంఎస్ నాయకుడు బసవయ్య, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు అంకెం త్రిమూర్తులు, నాగిరెడ్డి కొండ తదితరులు పాల్గొన్నారు.




## బాలయోగి ఆశయాలు ఉన్నతం : కామినేని

కైకలూరు, అక్టోబరు 1: పార్లమెంట్ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి ఆశయాలు ఉన్నతమైనవని ఎమ్మెల్యే కామినేని అన్నారు. మంగళవారం బాలయోగి జయంతి సందర్భంగా కైకలూరులో కూటమి నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి బాలయోగి కృషి చిరస్మరణీయమన్నారు.

## అడ్వొకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను రద్దు చేయాలి


కోర్టు వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

నూజివీడు టౌన్, అక్టోబరు 1: అడ్వకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను తక్షణం రద్దు చేయాలని నూజివీడు కోర్టు హాల్ ప్రాంగ ణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్య ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టం వల్ల కక్షిదారులు, న్యాయవాదులకు తీవ్ర అన్యాయం జరగుతుందన్నారు. చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంగళ, గురు, శుక్రవారాల్లో న్యాయవాదులు తమ విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## మెనూ ఛార్జీలు పెంచాలి

ఆగిరిపల్లి, అక్టోబరు 1:మధ్యాహ్నం భోజన కార్మికులపై వేధింపులు, తొలగింపులు ఆపాలని, బుధవారం విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి గరిసేపల్లి రాజు కోరారు. సోమవారం ఆయన ఆగిరిపల్లిలో మాట్లాడారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతన బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

చాట్రాయి/ముసునూరు, అక్టోబరు 1: కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చెయ్యాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కోటపాడు, చీపురుగూడెం సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ. 600 వేతనం ఇచ్చి ఏడాదిలో 200 రోజులు పనులు కల్పించాలని కోరారు. ఈ మేరకు సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం రమణక్కపేట సచివాలయం వద్ద ప్రజా సమస్యలపై లిబరేషన్ అధ్వర్యంలో ధర్నా చేశారు.

## సబ్సిడీపై ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలి

కలిదిండి, అక్టోబరు 1 : సబ్సిడీపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వాలని ఆక్వా రైతులు కోరారు. మంగళవారం భాస్కరరావుపేట, సంతోషపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సబ్సిడీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ నిలుపుదల చేయటంతో అవస్థలు పడుతున్నామన్నారు. స్పందించిన మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, కూటమి నాయకులు పోకల ప్రసాద్, పాల్ రాజ్, నాగరాజు, మత్స్యశాఖాధికారులు పాల్గొన్నారు.


ముసునూరులో పెన్షన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

## పండుగలా పింఛన్ల పంపిణీ

ముసునూరు, అక్టోబరు 1: పింఛన్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. ముసునూరు మండలంలో 97 శాతం పెన్షన్ల పంపిణీ జరిగింది. ముసునూరులో సర్పంచ్ విజయలక్ష్మి యిర్మియా, టీడీపీ మండల అధ్యక్షులు దేవినేని ధలరాం, తెలుగుయువత నాయకులు కొండేటి ఉదయ్‌కిరణ్, తులిమెల్లి రంగారావు, నక్కా యోహానులు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**చాట్రాయి:** మండలంలో మంగళవారం నాడు 95.52 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో జి. రాణి తెలిపారు. మండలంలో 16 సచివాలయాల పరిధిలో 8403 లబ్ధిదారులుండగా 8034 మందికి రూ 3.35 కోట్లు పంపిణీ చేశామన్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి కూటమి నాయకులు, ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పెన్షన్లు అందజేశారు. జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

**కలిదిండి:** మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలసి మంగళవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి 94 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. దీంతో వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు.

**ముదినేపల్లి:** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ మంగళవారం ముదినేపల్లి మండలంలో 98 శాతం పూర్తయింది. మండలంలోని అన్ని గ్రామాల్లో కూటమి నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేశారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు పరసా విశ్వేశ్వరరావు, దారం సుధ, పలువురు కూటమి నాయకులు పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో 8994 మందికి రూ.3.82 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 8815 మందికి రూ.3.74 కోట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

## నేటి నుంచి క్రీడా పోటీలు

పెదవేగి, అక్టోబరు 1 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 19 ఏళ్ల విభాగం క్రీడా పోటీలు బుధవారం నుంచి ఐదు రోజుల పాటు జరుగుతాయని ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. సాఫ్ట్‌బాల్, రగ్బీ పోటీలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ క్రీడా పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు.

## కేంద్ర పథకాల అమలుపై ఆరా

ఉంగుటూరు, అక్టోబరు 1 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు తెన్నులను మంగళవారం కేంద్ర బృందం పరిశీలించింది. కాగుపాడు, వీపీ పురం గ్రామాలలో పర్యటించిన ఈ బృందం గృహాల నిర్మాణం, పింఛన్లపై రైతులతో మాట్లాడింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వివిధ రిజిష్టర్లను పరిశీలించారు. ఇదే సందర్భంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న విధానాన్ని సచివాలయ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ బృందంలో సూర్యకాంత్ ప్రధాన్, అశోక్‌కుమార్ సాహు తదితరులు ఉండగా, వారి వెంట సర్పంచులు కడియాల సుదేష్ణ, శింగులూరి ధనలక్ష్మి, ఎంపీడీవో గంజి రాజ్‌మనోజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


కవ్వగుంటలో పింఛను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్


భీమడోలులో పింఛను పంపిణీ చేస్తున్న గన్ని వీరాంజనేయులు

పెదవేగి, అక్టోబరు 1 : పింఛను సొమ్మును ఒకటో తేదీనే అందించిన ఘనత సీఎం చంద్రబాబు ప్రభుత్వానికే చెందుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కవ్వగుంటలో మంగళవారం ప్రభాకర్ ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఒకేసారి రూ.వెయ్యి పెంచి, ఒకటో తేదీనే పింఛను అందిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, సుగసాని గంగాధరరావు, వెంకటేశ్వరరావు, ముప్పాళ్ళ నాగయ్య, కొట్టే నరేష్, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పసుపులేటి భార్గవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

- భీమడోలు : ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సమయానుకూలంగా ఒకటో తేదీనే ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.
- పెదపాడు : మండలంలో పింఛన్ల పంపిణీని 96.44 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. పలువురు పింఛనుదారులు అనారోగ్యం కారణంగా విజయవాడ, గన్నవరం వంటి ప్రాంతాల్లో చికిత్స పొందుతుండడంతో వారి వద్దకు వెళ్లి కార్యదర్శులు పింఛను అందజేసినట్లుగా ఎంపీడీవో తెలిపారు.

# కలప తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

టి.నరసాపురం, అక్టోబర్ 1 :మర్రిగూడెం ఫారెస్ట్ నుంచి జామాయిల్ కలప అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం గట్టుగూడెం గ్రామస్తులు పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవిలో కలపను గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని గుర్తించిన వీఎస్ఎస్ సభ్యులు టి.రామచంద్రం, పి.ప్రకాష్, టి.రాము, పి.శ్రీనివాస్ మరికొందరు 15 రోజులుగా కాపలా కాస్తున్నారు. సోమవారం రెండు ట్రాక్టర్‌లపై కలప తరలిస్తుండగా పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. ఫారెస్ట్ అధికారులు రెండు ట్రాక్టర్‌ల కలప స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు.

### ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెదవేగి, అక్టోబరు 1: అనుమతులు లేకుండా తమ్మిలేరు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

కొండలరావుపాలెంలో పేకాట ఆడుతున్న 12 మందిని మంగళవారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 42,800 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చామని చెప్పారు.

### వాహనాల చోరీపై కేసు

జంగారెడ్డిగూడెం : మూడు ద్విచక్ర వాహనాల చోరీలపై మూడు కేసులు నమోదు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాస రెడ్డి తెలిపారు. చింతలపూడికి చెందిన కె.శరత్‌బాబు, ద్వారకా తిరుమల దేవస్థానంలో డ్రైవరుగా పనిచేస్తున్న సీహెచ్ జగదీష్, స్థానికుడు వై.చిన్నశ్రీను ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామన్నారు.

### శింగరాయిపాలెంలో..

టి.నరసాపురం : శింగరాయిపాలెంలో పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద రూ.3,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.జయబాబు మంగళవారం తెలిపారు.

### అప్పనవీడులో విద్యుత్ వైరు చోరీ

పెదపాడు: అప్పనవీడు జడ్పీ హైస్కూల్ వెనుక ప్రాంతంలో పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి రాగి వైరును దొంగిలించారు. దీని విలువ రూ.5 వేలు ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ వై.రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పునరావాస గ్రామాల్లో మొక్కల పంపిణీ

పోలవరం, అక్టోబరు 1: ఓఎన్జీసీ, ఐటీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాల్లో మొక్కలు పంపిణీ చేశారు. ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జీ.అనిల్‌కుమార్ అభ్యర్థన మేరకు ఓఎన్జీసీ అధికారులు కార్పొరేట్ రెస్పాన్సిబులిటీ నిధులతో పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామమైన కోండ్రుకోటలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ కోండ్రుకోట పునరావాస కాలనీలలో అతి తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడినిచ్చే 1,866 మామిడి, సపోటా, కొబ్బరి మొక్కలు అందజేశామన్నారు.



పోలవరంలో మొక్కల పంపిణీలో పాల్గొన్న ఓఎన్జీసీ అధికారులు

ఓఎన్జీసీ రాజమహేంద్రవరం కేజీ పీజీ బేసిన్ మేనేజర్ కె.కరవణన్, చీఫ్ జనరల్ మేనేజర్ టీవీఎస్ ప్రసాద్, మేనేజర్ పాల జైవార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కేహి కిమోస్, చీఫ్ జియాలజిస్ట్ కె.ముత్తయ్య, కోండ్రుకోట, తూటిగుంట సర్పంచ్‌లు పైదా నాగరాజు, కుండల భద్రం, ఉప సర్పంచ్ కొత్తపల్లి చిన్నబాబు, ఫిలోమెన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ శ్రీనివాస్



ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నేతలు

కుక్కునూరు, అక్టోబరు 1: తమది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉప్పేరులో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ చైర్మన్ శ్రీనివాస్ వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలతో పంచుకున్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం పింఛన్ల పంపిణీ చేశారు. కుక్కునూరులో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఇంట్లో ఎమ్మెల్యే ట్రైకార్ చైర్మన్‌ను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వ రరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, చుంచు సత్యనారాయణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, మం త్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకటేశ్వరరావు, వి.లక్ష్మణాచార్యులు, అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలంటూ సీపీఎం నాయకులు ఎమ్మెల్యే బాలరాజుకు, ట్రైకార్ చైర్మన్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

### సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

టి.నరసాపురం : రామన్నపాలెం 100 అంగన్‌వాడీ కేంద్రం సమస్య పరిష్కరించాని కోరుతూ కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎ.ఫ్రాన్సిస్, జనసేన నాయకులు కె.నాగేశ్వరరావు, తదితరులు ఎమ్మెల్యే బాలరాజుకు వినతి పత్రం అందచేశారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి తీసు కువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కామవరపుకోట, అక్టోబరు 1: రాష్ట్ర స్థాయిలో జరగనున్న హ్యాండ్ బాల్ పోటీలకు ఆడమిల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.విజయకుమారి, పీడీ ఎం.సుబ్బారావు తెలిపారు. అండర్-14లో అక్షర, రమ్య, లక్ష్మీ, ధనశ్రీ, మాళవిక, చరణ్‌చందు, రాకేష్, అండర్-17లో గుణ ప్రవల్లిక, చరణ్ ఉన్నారని తెలిపారు.

## పండుగలా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 1 : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా నిర్వహిస్తున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని లక్కవరం, దేవులపల్లి గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం పట్టణంలో పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్ళి ఎమ్మె ల్యే పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ గంటల వ్యవధిలో నే సచివాలయాల సిబ్బందితో 90 శాతానికిపైగా పంపిణీ చేస్తున్నామన్నారు.

### మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. జెడ్పీ హైస్కూల్‌లో మధాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మట్లాడుతూ జెడ్పీ హై స్కూల్‌లో అక్టోబర్ ఒకటి నుంచి నూతన భోజన కాంట్రాక్టరును నియమించామన్నారు. కూటమి నాయకులు పారేపల్లి రామారావు, గద్దే బాబీ, చినము ననబు, మండవ లక్ష్మణ రావు, పరిమి సత్తిపండు, పెనుమర్తి రామకుమార్, రాజాన పండు, షేక్ ముస్తఫా, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, గుమ్మడి ప్రసాద్, తూటిగుంట రాము, వలవల తాతాజీ, చిట్రోజు తాతాజీ, అల్లూరి ప్రసాద్, మారిశెట్టి బాల చిట్టెమ్మ, జి.ఉమామహేశ్వరి, మున్సిపల్ మేనేజరు కె.వెంకటరమణ పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బుట్టాయగూడెం, అక్టోబరు 1 : గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ ట్రైకార్ ఛైర్మన్, పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. లక్ష్మడుగూడెం పరిధిలోని మాముళ్ళవారిగూడెంలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమం పడకేసిందని, నిధులు విడుదల లేక అభివృద్ధి జరగలేదన్నారు. అర్హులైన పేదలందరికి త్వరలోనే పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. సర్పంచ్ మడకం రామలక్ష్మీ, నాయకులు యంత్రప్రగడ శ్రీనివాసరావు, మొగపర్తి సోంబాబు, గద్దె అబ్బులు, ఆలపాటి దుర్గారావు, కుందుల శ్రీను, దొమ్మేటి పెద అమ్మిరాజు, కార్యదర్శి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## ఎరువుల గొడౌన్‌లపై విజిలెన్స్ అధికారుల దాడులు

కొయ్యలగూడెం, అక్టోబరు 1: బయ్యన్నగూడెంలోని రెండు ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఒక షాపులో నిల్వ ఉంచిన 32 మెట్రిక్ టన్నులు, మరో గొడౌన్‌లో 16.40 మెట్రిక్ టన్నుల ఎరువులను ఎరువులను సీజ్ చేశారు. ఈ రెండు గొడౌన్లలోని నిల్వల్లో వ్యత్యాస మున్నందున ఈ సీజ్ చేసి కేసులు నమోదు చేశామని విజిలెన్స్ ఇనస్పెక్టర్ పీ.శివ రామ కృష్ణ తెలిపారు. విజిలెన్స్ ఏవో సురేష్, విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసిన న్యాయాధికారి

చింతలపూడి, అక్టోబరు 1 : నగర పంచాయతీలోని పలు సంక్షేమ వసతి గృహాలను జూనియర్ సివిల్ న్యాయాదికారి సి.మధుబాబు మంగళవారం తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేసినట్లు ఆయన తెలిపారు. బాత్ రూముల సమస్యలున్నాయని విద్యార్థులు న్యాయాధికారి దృష్టికి తీసుకువచ్చారు.